# మొదటి తప్పు

పాత తాటాకుల పాక చూరునుంచి కాఫీ డికాక్షను లాంటి వర్షపునీరు ముఖంమీదికి పడుతున్నా, కాలు గుంజని చుట్టుకున్న మంగి గుర్రుపెట్టుతూ పడుకునే ఉంది. ఆ పాత తాటాకుల పాకల్లో మూడు రోజులుగా ఊడ్పుకూలీలు ఉంటున్నారు. వాళ్ళు వున్నన్నాళ్ళూ చంటిపిల్లల జోలె లలో, ముసలిమామ్మల ఆరిపోని చుట్టలలో ఆ పూరిపాకలు క్రొత్త అందాన్నీ సందడినీ సంతరించుకుంటాయ్. ఇంకా ఆషాఢమేఘాన్ని పూర్తిగా ఆహ్వానించకుండానే పాత పాకల్లో దూడల్ని ఇంకోచోటికి తరలించేస్తారు వ్యవసాయ దారులు. ఒకవంక దమ్ములు మొదలుపెట్టగానే ఈ పాకలు, ఆవులు, గేదెలు చేసిపోయిన రొచ్చునే వదలి, గడ్డితుక్కు-మంటలతో, ఇటుకరాళ్ళ పొయ్యిలతో సంసారపుటిళ్ళ హోదాలోకి వస్తాయి. కేవలం ఆకలితో 'అంబా, అంబా' అనే పశుసంతతిలోంచి 'వుంగా వుంగా' అంటూ ఈ అర్థం కాని ప్రపంచాన్ని ఆతృతతో పిలవచూచే మానవత్వపు మసుకార చిహ్నాలని తమలో దాల్చుకున్న ఆ వొంటి నిట్రాళ్ళపు పాకలు సన్న సన్నటి వానజల్లులని ఆస్వాదిస్తూ,

గాంభీర్యంగా దూరదూరంగా కన్పట్టుతున్న బంగాళాలనూ, మేడలనూ సవాల్ చేస్తున్నట్లు నిలుచుంటాయి.

ఆరోజు వానా, ముసురూ పట్టి అసలు సూర్యోదయ మయిందా, లేదా! అన్న భ్రాంతి కలిగిస్తోంది. మధ్య నిట్రాడి చుట్టూ అయిదారు పాతచీరెల జోలెలు ఆకలితో అటూ యిటూ పాక మూలమెల్లగా కదలించేట్టుగా వూగు తున్నాయి. ఏ డెనిమిదిమంది మగకూలీలు పాక ఇవతల బండరాళ్ళమీద కూర్చుని, ఇటుకరాళ్ళ పొయ్యిమీద తెల్లగా నురుగులు వస్తూ పొంగుతూన్న అన్నాన్ని అడుగున ఆకలితో ఎర్రగా నాలుకలు చాస్తున్న తాటాకు మంటల్ని ఎరుపు తెలుపుల మధ్య చీకటిలో కలుసుకపోతున్న కుండ నలుపుని చూస్తున్నారు. మంగిమామ్మ ఆదెమ్మ ఒక ఎండు పుల్ల ముక్కతో అన్నాన్ని అటూ ఇటూ కదుపుతూ—

"లెగవేమే మూడుముకందానా! అప్పుడే కామం దోరు మూడుసార్లు వచ్చి కేకేసి పోనారు..." అంది మంగికేసి చూస్తూ. మంగి బద్ధకంగా 'వూఁ' అంటూ కాలు గుంజని పాములా చుట్టుకుంటూ గోనెగుడ్డని మీదికి లాగు కుంది. ఒక పాతచీరె జోలె మరీ జోరుగా వూగింది "కేర్" మంటూ.

"అక్కమ్మా? కుసింత అణ్ని కూడా వూపిద్దూ!" అన్నది మామ్మ

"నాకేం లేకు కనుకా! నా పిల్లోణ్ని సూడాలి. అంగకనోణ్నిరి పిల్లణ్ని సూడాలి. అదేం? కూండు గిన్నెలోకి

దిమ్మరించేదాకా నెగదు. మాంచి పైరుబిగూలో నున్నది. యిటూ అటూ వొంగోని రెండు రూపాయలు బొడ్లో వేసు కుంటాది. దాని బాబుసొమ్మల్లే!" అంది అక్కమ్మ అక్క సుతో.

"యాంటే అక్కమ్మో! మాటలు జోరుగా వదు లుతున్నావ్? నివ్వే మా చెడ్డ పనికత్తెవంట! నీ పనంతా కరణంగోరి రాంవుడు కాపడేదాకానూ." అంటూ మంగి లేచి నిలువుగా ఒళ్ళు విరుచుకోబోయింది. చూరు అడ్డకమ్మ తలకు కొట్టుకుంది. ముక్కులోనుంచి మెదడులోకి చెప్పలేని బాధ అలమిపోగా -

"ఛీ! నీ జిమ్మడా!" అంది.

అక్కమ్మకు వళ్ళు మండి దగ్గరకు వచ్చి వాసం మేకు ల్లాంటి చేతివ్రేళ్ళతో మంగి రెండు బుగ్గలూ పొడుస్తూ-

"ఏం టంటన్నావ్? ఏంటన్నావో చెప్పు ఎదవ నోరుతో! నా......"అంటోంది. మంగి-

"అయ్య బాబోయ్! మామ్మోయ్! సచ్చా న్రోయ్ దేముడో" అని వెర్రిగా అరవసాగింది. మంగి ఆ కేకలికి పాతచీరెల జోలెలుకూడా అదిరిపోయాయి. అవి జోరుగా వూగుతూంటే వెదురుబద్దలు మీదపడేట్టుగా కిర్రు కిర్రు మంటున్నాయి.

"ఏహేయ్? ఎవర్రా అది, పొద్దుటేలే ఎదవగోడవ? దరిద్రపు పీనుగల్లారా?" అంటూ అంకడు వచ్చి ఇద్దర్నీ విడదీశాడు. అక్కమ్మ వుక్రోషంతో వూగిపోతూ,

"నాదే తప్పయింది. పెద్ది మరీ సెప్పిందిగందా అని నానో చ్చాను. లాపోతే "పరింగాడి" జట్టోళ్ళకి పాలెంకమ్మోళ్ళు రొండున్నర ఇత్తన్నారు. ఆళ్ళతో పోవాల్సింది. ఈ ఎదవ ముకంచేత చీపురుదెబ్బలు తింటానికి నాకేం పట్టింది? ఈరి గాడి ముకంసూసి వూరుకున్నాను" అంటోంది.

"వూరుకోకపోతే వూరిమీద పడి ఏడు. అంతేకాని నన్నంటానికి నువ్వెవత్తివి? నేనేం దుంగనా దూలాన్నా పడి వుండటానికి" వేపపుల్లని చెరుగ్గడలా నమిలి వుమ్మేస్తూ అంది మంగి. ముసలిది అన్నంకుండదింపి మూడుగిన్నెల్లోకి దిమ్మరించి వార్పు అంతా కొంచెం కొంచెం మూడు గిన్నె ల్లోనూ పోసి, పొడి పొడిగా వున్న కారం, కాస్త అన్ని గిన్నెల్లోనూ వేస్తూ-

"రావే అక్కమ్మా!" అని పిలిచింది.

"ఆళ్ళిద్దర్నీ కానీయిలే పెద్దీ! ఏంవన్నా మిగులూ తగులూ వుంటే నాకు పడేద్దువుకాని" అంది అక్కమ్మ.

అదేం గహచారం పిల్లా! కామందులు బత్తాబియ్యం కొలిసిత్తేను? అందరిదీ కడుపునిండే బేరమే. దా! దా! మళ్ళీ వాళ్ళు కేకలేత్తారు" అంది ముసల్ది బ్రతిమలాడుతూ. పసిపిల్లల తల్లులందరూ పిల్లలికి పాలిచ్చి వాళ్ల వొంటినిండా, తలనిండా ఆముదంరాసి, ముఖంనిండా పెద్ద అగరుచుక్కా, గడ్డంమీదా బుగ్గనా చిన్నచుక్కా పెట్టి ముద్దులాడుతూ మళ్ళీ జోలెల్లో పడుకోబెట్టారు. ఈసారి జోలెలు బరువుగా ఒకసారి అటూ ఇటూ కదిలిపోయాయి. ఒక జోలెమాత్రం

వూగటం మానలేదు. అందులో మంగికొడుకు వున్నాడు. మూడు నెలల పసివాడు. చామనచాయగా బొద్దుగా వుంటాడు. వాడి అరచేతులూ అరికాళ్ళు లేతగులాబీల్లాగా వుంటాయి. మంగిలాగే గుండ్రని ముఖమూ, నుదురుమీద చిన్న సుడీ! వాడిగురించే మంగీ, దాని మామ్మ మళ్ళీ అంకడి జట్టుతో ఈ వూరు వచ్చారు కూలి తక్కువయినా. తోటివాళ్లంతా రెండున్నరా మూడు తెచ్చుకుంటుంటే వీళ్లకి రొక్కటంగావే వుంది. జోలెలోని మంగికుర్రాడు బాగా గుక్క పట్టి ఏడుస్తున్నాడు.

"దాయె మంగిదానా! పిల్లోడి పాణం కడెట్టి పోత న్నాది" అని కేకేసింది ముసల్ది. పాకవతల కామందుల పాలేళ్ళు వచ్చి—

"లెండర్రా! మీకు మా లావు తెలుగు బలిసింది. ఏ ఝామయింది తెల్లారి?" అని అదిలిస్తున్నారు. ఒక్కొక్కరే త్రేనుస్తూ చుట్టలు వెలిగించుకుంటూ ఆడా మగా బయటికి వెళుతున్నారు. ఖాళీగిన్నెలూ బోర్లించిన కుండలూ మధ్య నిమ్మదిగా మంగి వచ్చి కూర్చుంది. బయటనించి—

"మా మంగమ్మ మహారాణీగారి సల్దిభోజనం ఇంకా కాలేదులెండి" అని అక్కమ్మగొంతు వినిపించింది.

"నేనంటే అట్టా సచ్చుద్దేంటి?" అంది మంగి.

"ఊరు కుందూ! దాని దో యవ్వారం! నీపని నువ్వా చూసుకోబుల్లే! ఇంకోరి ఊసు మనకేటి? అది సర్లే కాని గట్ల మీద కెవురు వత్తన్నారేటి?" అంది ముసల్ది ఆలోచనగా.

"ఒకో రోజు శంకరంబాబుగారు, ఒకోరోజు చిన్న దొరగారు' అంది మంగి గంజిలోంచి అన్నం మెతుకులు పిండి నోట్లో కుక్కుకుంటూను.

"నీ స్నానమాలు పట్టారా చిన్దొరగారు" అంది ముసలిది మంగికళ్ళల్లోకి చురుగ్గా చూస్తూ. ముసల్దాని కళ్ళు నాస పట్టిన బాకులల్లే మెరవసాగాయ్.

"వూ పరాసికాలాడారు కూడాను" అంది తనలో తనే అనుకున్నట్లుగా కుండ అడుగున దాచివుంచిన ఆవకాయ ముక్క, కాస్త తాటితాండ్రముక్క తెచ్చి మంగిగిన్నెలో వేసింది ముసల్ది మంగి గిన్నెలో చేయి కడుక్కొని, కొబ్బరి చిప్పలో వున్న చమురు తలకి రాసుకుని. నున్నగా గట్టిగా దువ్వుకొని, బిగించి ముడేసుకొని మధ్యాహ్నపుమూట పట్టుకుని–

"నే నెల్తున్నాను మామ్మోయ్!" అని నడవ సాగింది.

కొంచెంగా ప్రొద్దు ఎక్కింది. చెరువులో తామర పూవులు అక్కడొక్కటి ఇక్కడొకటీ సూర్యాగమనాన్ని ఆకాంక్షిస్తూనిలుచున్నాయి. తామరాకులమీద వానజల్లుపడి స్ఫటికాల్లా మెరుస్తూ కొంగలికి అవి గాజు పురుగులేమో అనే భ్రమ కలిగిస్తున్నాయి. బ్రాహ్మణులరేవుదగ్గర స్నానంచేసి వస్తున్న పూర్వసువాసిని ఒకత్తి–

"అట్టే! అట్టే! ఆగాగు నీ దుంప తెగా! ఇంకా తెల్ల

వారలేదుటే నీకు? ఇం తాలస్యంగా తగలడ్తున్నావ్?" అని తన మడీ, అధికారమూ వెల్లడి చేసుకుంది.

"పల్లేదు నడండి మామ్మగోరూ? మీ మనవడు తీసుకొచ్చిన 'జేని'గారికన్నా నేనేం తక్కువదాన్ని కాను. ఎటొచ్చీ దాన్ది తెల్లతోలు" అంది మంగి దారి కడ్డంగా నిలబడుతూ.

"ఒకటంటే పదంటున్నారు. వీళ్ళమ్మ కడుపుమాడ" అనుకుంటూ, డారమ్మట నీళ్ళు జల్లుకుంటూ వెళ్ళిపోయింది ఆవిడ.

"హుఁ అందరికీ లోకువా? నా సామిరంగా" అనుకుంటూ "రాగాలా సరాగాలా" అని కూనిరాగాలు తీసుకుంటూ బయలుదేరింది. ఆకుమళ్ల దగ్గర ఈరిగాడు కనబడ్డాడు.

"ఏందే ఎర్రిమొగమా? ఇంతగద్దు పొద్దెక్కిపోనాది. అప్పుడే చిన్దొరగారొచ్చి కూసున్నారు. ఎట్టగంట సచ్చేది సితో?" అన్నాడు, భుజంమీది ఆకుకావిడి బరువుకు వూగుతూ—

"వత్తేరాసి! ఆరి బాబునికూడా రమ్మన్ను. ఆరినాగ మనం గలాసులు గలాసులు కాపీలు ఎక్కించకపోతే మానె. గంజి నీళ్లన్నా తాగాలా నేదా!" అంది ఈరిగాడి ప్రక్కనే నడుస్తూ.

అది ఈరిగాడి కంటే జానెడు పొడుగున వుంటుంది. ముసురు పట్టివున్న ఈరోజున దాని చామనచాయ శరీరాన్ని చుట్టివున్న మిరపపండులాంటి ఎర్రని చీరా, భుజం

వొంపుల్ని బిగుతుగా కన్పరిచే మబ్బువాయిలు రెవికా చూట్టానికి ఎంతో మనోహరంగా వుంది.

ఎడం చెంపమీద ఒక చుక్కా, గడ్డంమీద కళావరులా మూడుచుక్కలూ, పచ్చబొట్టూ వున్నాయ్. అది నవ్వితే చెరువులో చేపపిల్లలు ఈదుతున్నప్పుడు కదిలే నీటి కదలికల్లా వుంటుంది. అది మూతి మూడు వంకర్లు త్రిప్పితే మునిగోరింట పూవు పూసినట్లుంటుంది.

అప్పుడే మూనతిరిగిన చేల మధ్యగా అది వనకన్యలా నడుస్తోంటే ఈరిగాడు దానివెంపు ప్రేమగా చూశాడు.

ఈరిగాడికి అదంటే పంచప్రాణాలూ! మంగి సాహచర్యంలో ఈరిగాడు స్వర్గపు అంచుల్ని చూస్తున్నట్లు భావిస్తాడు. క్రితం సంవత్సరం ఈరిగాడు వీళ్ళజట్టుతో వూడ్పులకు వచ్చాడు. అప్పుడు మంగినిచూసి మనువు నిసువు చేసుకున్నాడు. ఈసారి సకుటుంబంగా అదే వూరికి వూడ్పులకి వచ్చాడు. మళ్ళీ దానికి నువ్వు అంటకత్తెవని తెలియజెప్పినది దాని మామ్మ! క్రిందటేడు వూడ్పుల్లో జరిగిన సంఘటన—

"ఏం నిలబడ్డావ్? వొంగలేకపోతున్నావ్! అజీర్తి చేసిందా?" గట్టుమీంచి విన్పడిన క్రొత్తకంఠానికి వెనుతిరిగి చూసింది మంగి.

బొటనవ్రేలంత వెడల్పువున్న జరీ అంచుగల లుంగీ కట్టుకుని, సన్నటి తెల్లని పల్చని బనీను వేసుకుని బోదెగట్టు మీది చింతచెట్టు నానుకుని నించోని వున్నాడు శంకరంగారబ్బాయ్. పాలేళ్ళు అంతా చిన్నదొర అని పిలుస్తారు.

కొబ్బరిపీచులా ఎరుపు రంగుకి తిరిగిన బొద్దుమీసాలూ, మెడలో దూడల దిష్టితాడులూ, ఒకతాడులో లింగకాయా, రెండేసి నిముషాల కోసారి చిన్న గేదెదూడ అరిచినట్లు త్రేనుస్తూ నించునే శంకరంగార్ని చూసిన మంగికి చిన్నదొర యన్. టి. రామారావులా కన్పించాడు.

"ఆ రబ్బాబయే! పట్నంలో సదువుకుంటున్నారంట!"— మోచేత్తో పొడుస్తూ ప్రక్కనున్న సావాసగత్తె మంగి చెవులో చెప్పింది.

"ఆ జిత్తులన్నీ మీలాంటోళ్ళకి! మాలాంటోళ్ళకి డొక్కలే నెగవు బాబూ!" అన్నది మంగి అతనికేసి చూస్తూ.

పట్నంలో కొత్తగా అయిదురూపాయిలు కట్టి ఒక రాజకీయపార్టీకి సభ్యుడయిన చిన్నదొర (పేరు మనకి తెలీదు.) ఈ మాత్రం జవాబు పల్లెయువతి ఈయటంతో వుక్కిరి బిక్కిరయ్యాడు.

"సరిసర్లే! పని కానీండి. వుపన్యాసాలు తరువాత" అన్నాడు. మంగి అతనికేసి సూటిగాచూసి మడిలోకి వొంగింది.

అవతలి మడిలోవాళ్ళు వీళ్ళనిచూసి పదం అందుకున్నారు. దానికి చరణం మంగి అందుకుంది వంతులుగా పాటలు పాడుకుంటూ అసురసంధ్యదాకా వూడుస్తూనే వున్నారు.

అందరూ వూళ్ళోకి బయల్దేరారు. మంగి చేతులూపు

కుంటూ, నెమ్మదిగా అటూ ఇటూ చూస్తూ నడుస్తూంది. అరుణసంజకాంతుల్లో బోదెల్లోని నీరు ఇంకా ఎర్రగా, చిక్కగా కనబట్టుతోంది. మారంగా సరుగుడుచెట్ల సంగీతం లీలగా వినపడుతోంది. చెదిరిన మేఘాలను కూడగట్టుకుంటున్న ఆకాశం పచ్చగా పూచిన చేలమీదికి రహస్యంచెప్పే స్నేహితురాలివల్లే వాంగింది. పూడ్పుకూలీలు బురద కాళ్ళతో నడవటంనించి బోదెగట్టు పొడుగుకూ జారుడు జారుడయ్యింది.

పరధ్యానంగా ముందుకు నడుస్తున్న చిన్నదొర కాలు జారి బోదెలోకి తూలాడు "అమ్మా" అన్నాడు నెమ్మదిగా. దారిలో దొరికిన ఎర్రగన్నేరుపూలు తలలో కుక్కుకుంటున్న మంగి అప్రయత్నంగా అతని దగ్గరికివచ్చి చేతు లందించింది. అడుగు పైకి వేయబోయి మళ్ళీ దిగజారాడు! ఒకచేత్తో గట్టిగా మంగి చేతినీ, రెండో చేత్తో తుమ్మచెట్టునీ పట్టుకుని పైకి వచ్చాడు. చేతులో తుమ్మముళ్లు గుచ్చుకుని రక్తం చిమ్మింది అతనికి. ఆమె చేయి వదలకుండానే "థాంక్స మంగీ!" అన్నాడు మంగికి అదేమిటో తెలీకపోయినా తలా డించింది. సధ్యాకాంత తప్పుకుంటూ నిశాదేవికి స్వాగతం పల్కింది!

"అదురుట్టవంతురాలివి ? చిన్నదొరగోరి సావాసం పొందావు. ఏదన్న అడుగుతోందు బుల్లే! బాబూగార్ని. ఇత్తారు. పెట్టి పుట్టినోరు." అంది ముసల్ది. మర్నాడు ప్రొద్దుట మంగికి తలదువ్వి, బొండుమల్లిపూలు తలలో పెట్టూను.

"వూఁ అలాగేలే !" అని గునిసింది మంగి.

పూడ్పులు అయినాక పంటకుచ్చులు వేసేనాడు నలుగురు ముత్తయిదువులతో మంగినికూడా వుండనిచ్చేడు చిన్న దొర. ముత్తయిదువులు గుజగుజలాడారు కొబ్బరికాయలతోపాటు మంగికి అయిదు రూపాయలు దక్షిణకూడా ఇచ్చేడు!

ఆరోజు ఈరిగాడి మనసు ఏదోలా అయింది. సంధ్య వేళ మామ్మదగ్గరకూర్చుని మంగిని మనువు అడిగాడు.

"తులం బంగారం జాతరసేయి మనవడా!" అంది ముసల్ది.

"వో దానికేం? అది నా ఇంటికొస్తే నా ఇల్లూ దాని వొళ్ళూకూడా బంగారమే" అన్నాడు ఈరిగాడు. వాడి మనసులో పదిరోజులుగా మధనపడుతున్న ఆవేదనంతా చెరువులో బురదచేతులు కడిగేసినట్లుగా పోయింది

"వొంటిగా వొచ్చినాను జంటగా ఎల్తున్నాను. మీ జట్టులోంచి" అన్నాడు మంగిని ఈతచెట్టుదగ్గర కలుసుకుని—

"ఏటంటా ఇసేసం?" అంది.

"ఇసేసం కాదు. ఇసిత్రంకాదు. సెనెమా! నువ్వు నా కళ్ళకి అంజలీనాగున్నావు!" అన్నాడు.

"అయితే నిన్ను రాజకుమారుడివి అంటాలే ఇక్కణ్నించీ!" అని కిలకిలా నవ్వుతూ పరుగెట్టింది లేడిలా. వెన్నంటి పరుగెట్టుతూ, ఆమె రెండుచేతులూ దొరకబుచ్చుకున్నాడు ఈరిగాడు.

"ఏం మా ధీమాగా నడుస్తున్నావ్ పెళ్ళినడక? ఈ రోజు నువ్వు రా అక్కర్లేదు. పో! మాకు చెట్లకు కాయలు కాయటంలేదు రూపాయలు" అన్నాడు చిన్నదొర. విన్పించుకోకుండా మడిలోకి దిగింది మంగి.

"ఒరేయి! ఈరిగా! ముందు దాన్ని ఇవతలికి లాగి మరీ అందియ్యి ఆకు" అన్నాడు గంభీరంగా. ఒకసారి కళ్ళు చికిలించి చూసింది మంగి.

"పూఁ రావాలి. వెధవవేషాలు" విసవిసా నడుచుకుంటూ ఇంకోగట్టుమీదికి వెళ్ళిపోయాడు చిన్నదొర.

"వాళ్ళకోయే ఇయ్యాల్టికి. ఏం చేస్తాం మరి? మడిలో సగానికి సగం అయిపోనాది" అన్నాడు ఓదార్పుగా ఈరిగాడు

కనుచీకటి పడుతోంది. దారి అంతా మసగ్గావుంది. చేతిలో చిన్నకొరడాతో నడుస్తున్న చిన్నదొర.

"దొరగోరూ?" అనే సన్నటి గొంతుకి లిప్తపాటు ఆగేడు.

"ఎవరది?"

"నేను మంగిని!" అన్నది. ఆ సంజచీకటిలో ఆమె చిరునవ్వుముఖమూ మెరిసేకళ్ళూ అతనికి అగపళ్ళేదు. చూడగలిగితే ఏమో!

"పిల్లాడు కల్గాడు. ఏదన్నా ఇస్తారేమో అడగమన్నది మాఅమ్మ!" గొంతు కంపిస్తూంటే అడిగింది మంగి.

"బాగుంది, మా బాగుంది! నేను జేబుల్లో రూపాయలు పోసుక తిరుగుతున్నా ననుకున్నావేమిటి? ఇంటిదగ్గర అమ్మగారిని అడగలేకపోయావా ఏవన్నా పాతబట్టలుంటే పడేద్దురూ! ఏదో సరదాగావుంటే అదే పట్టుక్కూచున్నావల్లే వుంది" అన్నాడు దూరంగా జరుగుతూ.

సాయంత్రం ఫాళ్ళ పాలేరు ఎత్తుకున్న వాళ్ళ అబ్బాయి మంగి దృష్టిపథంలో మెదిలాడు. నల్లగా సన్నగా వున్నా ఫ్రరటి ముఖమల్ గుడ్డలూ మెళ్ళో బంగారు పులిగోరు పతకంతో వుంటంచేత ఆ అబ్బాయ్ యొక్క జాత్యాభిజాత్యము తెలిసిపోతూంటుంది. తన పిల్లడు ఆముదంజిడ్డోడుతూ జోలెలో చీమలుకరుస్తుంటే ఏడుస్తో బ్రతకలేక బ్రతుకుతాడు. ఈరిగాడదేమోకాని వాణ్నొక్కసారికూడా ఎత్తుకుని సముదాయించడు. వాణ్ని బాగా చూడమని ఈరిగాడితో అంటానికి ఆమెనోరు రాదు. ఏదో బాధ ఆమెలో కలిగింది. వాడు పెద్దయినా బాముకునేదేముందికనుక? ఇలా కూలీలా గడపాల్సిందే కదా? తనొకర్తీ వాణ్ని వున్నతంగా పెంచలేదు. పురుగు పట్టినప్పుడే చిగురాకుని తుంచెయ్యాలి. ఆ ఆకు పెద్దదవగల్గినా చూట్టానికి అసహ్యంగా చిల్లులు చిల్లులుగా తయారవుతుంది.

ఆ నిశ్శబ్ద నీరవ నిశీధిలో ఆకాశం కాయనలుపుని పులుముకుంటుంటే ఆమెలోని మాతృత్వపు మమకారం మసి అయిపోయింది. కుర్రవాణ్ని బ్రాహ్మణుల రేవువెంపు చెరువు గట్టుమీద పడుకోబెట్టింది. చెరువులోని రెండుకప్పలు

తలలని లోపలకు లాక్కుంటూ బెక బెకమన్నాయ్. ఆమె కాస్సేపు అలానే గట్టుమీద నిలబడింది ఆకాశంవెంపు చూస్తూనూ. ఏటవాలుగా వున్న గట్టుమీది పిల్లవాడు చలికి మెలికలవరాగా చేతులూ, కాళ్ళూ వూపుకుంటూ కేరుమని ఏడుస్తూ క్రిందకి జారిపోసాగాడు. కాని మంగి కారునలుపుని పులుముకున్న ఆకాశంవెంపు చూస్తూనే వుండిపోయింది! నీళ్ళల్లో "దబ్" మన్న చప్పుడికి మంగి వులిక్కిపడి చేతులతో హృదయాన్ని అదుముకుంటూ పరుగుతీసింది.

కాకులు కూసేవేళలో కూలీలంతా పాకలు ఖాళీచేసి వూరు విడచి పోసాగారు. సగం ప్రొద్దెక్కేసరికి వాళ్ళంతా ఒక చింతచెట్టుక్రింద చేరి అన్నాలుతినేవాళ్ళు అన్నాలు తినసాగారు. చంటిపిల్లల తల్లులు తమ పిల్లలికి పాలిస్తూంటే మంగి వాళ్ళకి కాస్త దూరంగా నిలబడింది.

"పిల్లోడేడే మంగా?" అంది ముసల్ది. మంగి జవాబే ఈయలేదు. ఆకాశంవెంపు చూస్తున్న ఈరిగాడు—

"జల్లు పెద్దయ్యేని, లేమలండర్రా?" అన్నాడు.

"ఏమే మంగా? అయ్యగోరు పెంపిత్తానన్నారేటి?" అంది ముసల్ది. ఆశతో ఆమె కళ్ళు చెక్కుతీసిన ముంజలల్లే వున్నాయ్. "ఇష్. ష్. నెమ్మది" అంది మంగి. ఆమె కళ్ళు మూసుకొని మనస్సులో "మొదటితప్పు" అని గొణుక్కుంది.